# పల్లె ముంగిటకే వైద్యసేవలు

- ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం భరోసా
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై ప్రజల హర్షం



ఎగువ రామాపురంలోని విలేజ్ హెల్త్ క్లినిక్

కలసపాడు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. గతంలో వైద్యసేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్ళేవారు. ఆర్థిక స్తోమత లేనివారు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను తీసుకువచ్చారు. గ్రామం నుంచి 1 లేదా 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లనవసరం లేకుండా గ్రామంలోనే వైద్యసేవలు, వైద్యపరీక్షలు పొందేందుకు వీలుగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఈ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వీటి ద్వారా కొన్నేళ్ళుగా వైద్యం అందని గ్రామాలు, 108, 104 వాహనాలు వెళ్ళని గ్రామాల్లో కూడా నేడు చికిత్సలు అందుతున్నాయి. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఆసుపత్రికి వెళ్ళలేని రోగుల వద్దకు డాక్టర్లు వెళ్ళి వైద్యసేవలు అందిస్తున్నారు.


**కలసపాడు మండలంలో 11 క్లినిక్‌లు**

మండలంలో 11 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. వీటిలో 8 పూర్తయ్యాయి. మిగిలిన 3 వివిధ దశల్లో ఉన్నాయి. క్లినిక్‌ల భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.17.50 లక్షలు కేటాయించారు.

**ఉచితంగా 105 రకాల మందులు**

సుమారు 2 వేల నుండి 3 వేల జనాభా కలిగిన ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఉంటుంది. ఈ సెంటర్‌లో 24 గంటలు వైద్యసేవలు అందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అలాగే షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్యపరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలు పూర్తి కాని చోట్ల గ్రామ సచివాలయాల్లో సెంటర్లను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణీస్త్రీలకు నిరంతరం వైద్య బృందం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. సెంటర్‌కు వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సెంటర్ పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించిన డాక్టర్లు 104 వాహనం ద్వారా వచ్చి వైద్య సేవలు అందిస్తారు.

**వైద్యం బాగుంది**



గతంలో చిన్న రోగానికి కూడా మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాల్సి వచ్చేది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌తో దూరం తగ్గి ఇక్కడే చికిత్స పొందుతున్నాం. నాకు బీపీ ఉంది. 104 డాక్టర్లు ప్రతి నెలా మందులు అందిస్తున్నారు.

– బాసిరెడ్డివీరారెడ్డి, ఎగువ తంబళ్ళపల్లె, కలసపాడు

**ఉచితంగా మందులు**



వృద్ధాప్యంలో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసిన తర్వాత చాలా వరకు ఆ ఇబ్బందులు తొలిగాయి. చిన్న రోగం వచ్చిన వెంటనే ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నాం. ఇక్కడ వైద్యపరీక్షలు, మందులు అన్నీ ఉచితంగా ఇస్తున్నారు.

– వెంకటసుబ్బమ్మ, ఎగువ రామాపురం, కలసపాడు

**మెరుగైన వైద్య సేవలు**



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పూర్తిస్థాయిలో ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. 105 రకాల మందులు, 14 రకాల వైద్యపరీక్షలు చేస్తారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు గ్రామంలోనే వైద్యం పొందవచ్చు.

– శైలజ, పీహెచ్‌సీ వైద్యాధికారి, కలసపాడు

## బద్వేలును సుందరంగా తీర్చిదిద్దుతాం

**ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి**



శివాలయంరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీని త్వరలోనే సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.130 కోట్ల నిధులలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శివాలయంరోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకవర్గ హయాంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని బద్వేలు మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించారన్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయలేదన్నారు. అనివార్య కారణాల వల్ల కొన్ని వార్డుల్లో పనులు ఆలస్యం అయ్యాయని,వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బైత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి,నగర కార్పొరేషన్ చైర్మన్ రమణమ్మ, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,శేఖర్‌రెడ్డి,గిద్దలూరు అసెంబ్లి ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి,నియోజవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్షిదేవిశ్రీరాములు, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రొద్దుటూరు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ బైక్‌లు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

## ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మైదుకూరు : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌ఎస్‌ఓ) రాష్ట్ర అధ్యక్షుడు జగన్ కోరారు. మైదుకూరులోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయాలని ఆయన శుక్రవారం ఎంఈఓ పద్మలతకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నిర్వహిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.

## గుర్తు తెలియని శవానికి అంత్యక్రియలు

పోరుమామిళ్ల : పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు తెలియక పోవడంతో శుక్రవారం వివేకానంద ఫౌండేషన్ వారు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.వివరాలిలా ఉన్నాయి. కాశినాయన మండలం ఎస్టీ కాలనీ సమీపంలో 65 సంవత్సరాల వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడిని ఎవరూ గుర్తుపట్టక పోవడంతో ఎస్‌ఐ హరిప్రసాద్ పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ల పంపించారు. శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేశాక అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసిలకు సమాచారమిచ్చారు. వారు సంస్థ సభ్యుడు వెంకటేశ్వర్లుతో వచ్చి కొండా ఫణీంద్రారెడ్డి వాహనం సమకూర్చగా, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, కానిస్టేబుల్ ఖాదరయ్య సహకారంతో అంత్యక్రియలు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.

## 21న ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం



మైదుకూరు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఈనెల 21న పలువురు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జగనన్న హరిత వనాలు కార్యక్రమంలో భాగంగా రూ.4 కోట్లతో మైదుకూరు రోడ్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వంద అడుగుల జాతీయ పతాకం స్థూపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఇరువైపులా రోడ్డును విస్తరించడం, ఫుట్ పాత్‌లు నిర్మించడం జరుగుతుందన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో పట్టణాన్ని అందంగా తయారు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామని, తొలి విడతలో ఈ రోడ్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా రూ.1.20 కోట్లతో టెండర్లు నిర్వహించామని, మిగతా పనులను త్వరగా చేపడుతామన్నారు. ఈనెల 21న ఈ అభివృద్ధి పనులతోపాటు పలు పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పర్యాటక శాఖ మంత్రి రోజ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎంపీ సింగారి సంజీవ్ కుమార్ తదితర ప్రముఖులను ఆహ్వానించామన్నారు. గతంలో ఈ రోడ్డులో డివైడర్లు, డ్రైనేజి కాలువలను నిర్మించి అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. కిలోమీటరు పరిధిలో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, మాజీ కౌన్సిలర్ రఫిక్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్ ఎం.వెంకటసుబ్బారెడ్డి, గంగిరెడ్డి మాధవరెడ్డి, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, డీఈ దాస్, ఏఈ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపుల్లయ్య స్వామి శివైక్యం



ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని శ్రీ సద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీపుల్లయ్య స్వామి శుక్రవారం సాయంత్రం శివైక్యం చెందారు. వారం రోజులుగా అనారోగ్యం కారణంగా ఈయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం పరిస్థితి విషమించి మరణించారు. శ్రీపుల్లయ్యస్వామి ప్రస్తుత ఆశ్రమ పీఠాధిపతి గోపాల స్వామికి తండ్రి. పుల్లయ్య స్వామి గతంలో ఉప్పరపల్లె గ్రామ కరణంగా విధులు నిర్వహించారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరణం వ్యవస్థను తొలగించడంతో ఈయన విధులకు స్వస్తి చెప్పి ఉప్పరపల్లె సద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమాన్ని 1990లో స్థాపించారు. పుల్లయ్య స్వామి భౌతికకాయం భక్తుల దర్శనార్థం ఉప్పరపల్లె ఆశ్రమంలో శనివారం ఉదయం 11 గంటల వరకు ఉంటుందని, ఆ తర్వాత ఆశ్రమంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆశ్రమ పీఠాధిపతి గోపాలస్వామి పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'



సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నంద్యాలంపేట–1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో 451 మందికి కుల ధ్రువీకరణ, 450 మందికి ఆదాయ సర్టిఫికెట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 22 మందికి ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేశారు. ఆరు మందికి జనన ధృవీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, సర్పంచ్ చెన్నయ్య, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపాలిటీలో..**

మైదుకూరు మున్సిపాలిటీలోని 11వ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

దువ్వూరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఓబులేసు పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందించారు. తహసీల్దార్ రమకుమారి, సచివాలయ కన్వీనర్ ఈ.శంకర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ ప్రభావతమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల్లో నెల రోజుల పాటు అన్ని రకాలైన ధృవీకరణ పత్రాలను ఉచితంగా మంజూరు చేయటం జరుగుతుందని ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. జగనన్న సురక్ష గ్రామ సభల్లో ప్రజలు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ తెలియజేశారు. మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగీ, డిప్యూటీ తహసీల్దారు భవానీ, గ్రామ సచివాలయాల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, ధృవీకరణ పత్రాలు జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ఈ పథకం అమలు చేశారని పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పుల్లివీడు సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని అర్హులైన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు జగనన్న సురక్ష పథకం ద్వారా నెల రోజులు వలంటీర్లతో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వారికి అవసరమైన పత్రాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. మండల ఉపాధ్యక్షుడు సీఎం బాష, సచివాలయాల మండల కన్వీనర్ కల్లూరి రమణారెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, పుల్లివీడు సర్పంచ్, వలంటీర్లు పాల్గొన్నారు.

**ఒకే రోజు 1499 సర్టిఫికెట్ల పంపిణీ**

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఒకే రోజు దరఖాస్తు చేసుకున్న ప్రజలకు 1499 సర్టిఫికెట్లు మంజూరు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 10, 12, 14 వార్డుల సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత వేగంగా ఉచితంగా సర్టిఫికెట్లను ఇవ్వలేదన్నారు. రైస్ కార్డులు, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు రైతులకు సంబంధించిన పత్రాలను ఇవ్వడం జరుగుతోందన్నారు. పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింహాపురం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడు సచివాలయాలకు సంబంధించి 1280 సర్టిఫికెట్లు మంజూరు చేయగా, నరసింహాపురం సచివాలయానికి సంబంధించి 219 సర్టిఫికెట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, పట్టణ వార్డుల సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, బండారు సూర్యనారాయణ, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, కల్లూరు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ అన్నారు. ఏరువపాళెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలకు సంబంధించిన 630 సర్టిఫికెట్లను ఉచితంగా అందిచామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుభాషిణి, సర్పంచ్ సంధ్య, అధికారులు, గృహ సారధులు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

## క్లుప్తంగా

### సీబీఐటీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 115 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు కరస్పాండెంట్ డా.వి.జయచంద్రారెడ్డి తెలిపారు. కాలేజీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో రాయచోటికి చెందిన దీప బ్లడ్ బ్యాంక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 115 మంది విద్యార్థులతోపాటు అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



శాకంబరిదేవి అలంకారంలో కనకదుర్గమ్మ

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల పండ్లు,కూరగాయలతో నిర్వహించిన శాకాంబరిదేవి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు పీహెచ్‌సీకి భూమిపూజ

దువ్వూరు : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో రూ.2.50 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం ఉదయం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమిపూజ చేయనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

### పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చని ప్రొద్దుటూరు మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆచార్ల కాలనీలో శుక్రవారం విద్యార్థులు, పురప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ బీఏ ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణమ్మ, సీహెచ్‌ఓ బేబి, ఎఫ్‌సీపీ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీజేపీకి వివక్ష లేదు

పోరుమామిళ్ల : భారతీయ జనతాపార్టీలో ముస్లిం పట్ల వివక్ష లేదని, వారి అభివృద్ధి కోసం బీజేపీ ఎన్నో అభివృద్ధి పథకాలు ప్రవేశ పెట్టిందని ఆ పార్టీ బద్వేలు అసెంబ్లీ ఇన్‌చార్జి ఉట్టి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రాజకీయపార్టీలు వారి మనుగడ కోసం బీజేపీపై అసత్య ప్రచారం చేస్తున్నాయని, కొంతమంది ముస్లిం పెద్దలు కూడా ఇందుకు దోహద పడుతున్నారన్నారు.

### ప్లేట్లు, కుర్చీలు వితరణ

మైదుకూరు : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌కు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి స్టీల్ ప్లేట్లు, కుర్చీలను వితరణ చేశారు. పాఠశాలలో శుక్రవారం రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముందస్తు జయంతి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తూ రవిశంకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పాఠశాలకు 30 కుర్చీలను అందజేసిన రవిశంకర్‌రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ రమాదేవి, బాలికల హైస్కూల్ హెడ్మాస్టర్ గంగా భవానితో కలిసి విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు.

### భూమి పూజ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని రూ.26వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించనున్న డ్రైనేజి కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి శుక్రవారం భూమి పూజ చేశారు.

### ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. యోగివేమన యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కాలేజ్ ఆవరణలో గత మూడు రోజులుగా ఒప్పంద అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు.

## దోమల నివారణతో జ్వరాలు దూరం

అట్లూరు : దోమల నివారణతో జ్వరాలు దరిచేరవని వైద్యాధికారులు డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ విశ్వంత్ పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవంలో భాంగంగా అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి విద్యార్థుల చేత శుక్ర వారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలన్నారు. అలాగే పాతటైర్లు, పాత కూలర్లు, వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలను నివారించుకుంటే వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీకృష్ణ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, పబ్లిక్‌హెల్త్ నర్సు లక్ష్మీదేవి ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.